# క్షణికం

పరుగెత్తుతూన్నట్లుగా బస్ స్టాప్ కి వచ్చింది పల్లవి. వాతావరణం చల్లగా వుంది. ఏ క్షణమైనా వర్షం రావచ్చుననిపిస్తోంది. ఇండస్ట్రియల్ ఏరియా కావడంతో ఎవరూ జనం లేరు. బస్ స్టాప్ లో కూడా ఒకళ్ళిద్దరే వున్నారు.

"గొడుగన్నా తెచ్చుకోలేదు." ముసురుకుంటున్న చీకటిని చూస్తూ భయంగా అనుకుంది.

రయ్యిన గాలి వీస్తుంటే చీరకొంగుని తలమీదుగా కప్పుకుంది. ఆ గాలితో పోటీ పడుతూ ఆమె ముందునుండి దూసుకుపోయింది రెడ్ కలర్ మారుతీ కారు.

అది సందు తిరిగే వరకూ అలాగే చూసింది పల్లవి. ఆమె బాస్ కారు అది.

పల్లవి ఆ ఆఫీస్ లో చేరి ఆర్నెల్లు అవుతోంది. విజయవాడలో బి.టెక్. పూర్తి చేశాక, ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులనీ, అక్కయ్యనీ వదిలేసి ఒంటరిగా హైదరాబాద్ వచ్చింది.

ఆఫీస్ లో అందరూ బానే వుంటారు కానీ యింకా పూర్తి హెూల్డ్ రాలేదు. ఇది నా ఆఫీస్ అనుకునే ధైర్యం రాలేదు.

ఆమె ఆలోచిస్తూండగానే దూరంగా ఆఫీస్ గేట్ లోనుంచి మరో రెండు కార్లు బయటికి వస్తూ కనిపించాయి.

పల్లవితో పాటు బస్ స్టాప్ లో నిల్చున్న మగవాళ్ళిద్దరూ ఏవో స్కూటర్లు వస్తే లిఫ్ట్ అడిగి వెళ్ళిపోయారు.

గాలి ఎక్కువయింది. ఉన్నట్లుండి పన్నీరు చల్లినట్లూ మొహం మీద వర్షపు జల్లు పడింది. ఆ వెంటనే పెద్ద పెద్ద చినుకులతో వర్షం మొదలయింది.

ఆఫీస్ లోనుండి బయల్దేరిన రెండు కార్లూ బస్ స్టాప్ ముందుకు వచ్చాయి. చేయెత్తి ఆపాలనుకుంది పల్లవి.

మొహమాటం, సిగ్గు వదుల్చుకుని యివతలికి వచ్చేసరికి అవి ఆమెను దాటేశాయి. ఆ ఒక్కక్షణంలోనే ముద్దగా తడిసిపోయింది పల్లవి. భయంతోనూ, కంగారుతోనూ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. దూరంగా మలుపు తిరుగుతున్న కార్ల లైట్లు మసకమసకగా కనిపిస్తూంటే.. బిత్తరపోయి చూస్తూ నిల్చుంది.

ఆమె అలా చూస్తూండగానే. . వెనుకనుంచి ఒక కారు చాలా నెమ్మదిగా వచ్చి ఆమె ప్రక్కన ఆగింది. ఆ శబ్దానికి ఉలిక్కిపడి చూసింది పల్లవి. అప్పటికే అతను మెల్లగా డోర్ తెరుస్తూ "రండి" అన్నాడు.

"అభిరామ్. . మార్కెటింగ్ మానేజర్. ."

కారు బయల్దేరి సందు తిరిగేస్తున్నపుడు కానీ అర్థం కాలేదు ఆమెకి, తను అభిరామ్ కార్లో ఎక్కి. . అతని ప్రక్కన కూర్చుందని. . అర్థమయ్యాక గుండె ఝల్లుమంది.

"డోర్ సరిగా పడలేదు." పెదవులు కదిలీ కదలకుండా చెప్పాడతను. అంతలోనే అతని చేయి చురుగ్గా వచ్చి డోర్ వేసింది. అంత సాధారణంగానూ ఆ చేయి ఆమె గుండె అంచులని తాకింది.

మరోసారి ఉలిక్కిపడింది పల్లవి.

"లేటయ్యిందెందుకు!" అడిగాడతను.

సమాధానం చెప్పేందుకు గొంతు పెగలలేదు.

"వర్క్ ఎక్కువగా వుందా!" మళ్ళీ అతనే అడిగాడు.

గబగబా తలవూపింది.

ఆమె తలవూపిన తీరుకి అతను చిరునవ్వు నవ్వాడు.

మెత్తగా పువ్వులా సాగిపోతోంది కారు ఆ చీకట్లో. . వర్షంలో. .

అయిదునిమిషాల క్రితం వరకూ ఆ మారుమూల నుంచి ఎలా బయటపడతానో అని భయపడిన పల్లవికి. . ,

. . యిపుడు అతను అలా హాయిగా, చినుకుకీ చినుకుకీ మధ్య రధం నడపగల అర్జునుడిలా తనని తీసుకువెళ్ళిపోతుంటే తమాషాగా వుంది. ఏదో థ్రిల్ నరనరంలోనూ నిండుతోంది.

వర్షం ఎక్కువయిందనీ, ఆ హెూరులో ఏమీ వినిపించడం లేదు. చిక్కటి చీకటి. బయటి ప్రపంచంతో సంబంధం తెగిపోయినట్లుగా వుంది.

చలి వణికించేస్తోంది. ఆ వణుకులోనుంచీ ఏదో తీయని బాధ. అతనికి యింత దగ్గర్లో. ఈస్థితిలో తను. .

ఆ భావనే మధురంగా వుంది.

"ఎక్కడుంటున్నారూ!" అతని గొంతు, అడిగే తీరు, ప్రతిమాటా ఆమె ఆకర్షణని మరింత పెంచుతున్నాయి.

"చిక్కడపల్లి" తన గొంతు తనకే తీయగా ధ్వనిస్తుంటే చెప్పింది పల్లవి.

ఎందుకు ఇతను యిలా మాట్లాడతాడు! ఏదో తనకి మాత్రమే రహస్యంగా చెపుతున్నట్లూ.. గొంతులో బోల్డంత లాలన నింపి!

"..ఒక్కళ్ళే వుంటున్నారా!"

"ఊఁ." దిగులు స్పష్టంగా వినిపించింది ఆమె గొంతులో.

అది గమనించినట్లూ అతను తిరిగి చూశాడు. "భయం లేదా!" నవ్వుతూ అడిగాడు.

పల్లవి కళ్ళు విప్పార్చుకుని చూసింది. "భగవంతుడా! ఎందుకు యితను ఏం మాట్లాడినా గుండె యింత తీయగా కొట్టుకుంటుంది! అతని గొంతు వినపడితే చాలు భరించలేని ఆనందం కలుగుతుంది!!"

తడిసి వంటికి అతుక్కుపోయిన చీరతో అతని ప్రక్కన కూర్చోవడం చాలా యిబ్బందిగా వుంది. మరో ప్రక్కన చలి...

కాళ్ళు పైకి పెట్టుకుని ముడుచుకు కూర్చోవాలనిపిస్తోంది. అప్పటికి కారు ఎక్కి పదినిమిషాలవుతోంది. ఇక్కడ కొంచెం తక్కువగా వుంది వర్షం. పల్లవికి అప్పుడప్పుడే స్పృహ వస్తున్నట్లుగా అనిపిస్తోంది.

అయితే ఈ స్పృహ కూడా మామూలు స్పృహకి భిన్నంగానే వుంది.

మొదటి పదినిమిషాలూ అతను తప్ప ఏమీ కనిపించలేదు. ఇపుడు అన్నీ కనిపిస్తున్నాయి కానీ కొత్తగా కనిపిస్తున్నాయి.

బయట చీకట్లో పరుగులు తీస్తున్న చెట్లూ.. మైదానాలు.. షాపులూ.. లైట్లూ.. అన్నీ ఇంద్రలోకంలో వీధుల్లా ఉన్నాయి.

హటాత్తుగా కారు ఆగింది.

"జస్టే మినిట్" అని, ఆమాట ఆమెకి అర్ధమయేలోపలే అతను కారుదిగి షాపులోకి వెళ్ళాడు.

అమృతా లేడీస్ ఎంపోరియం... ఏం కొంటాడు యితను యిక్కడ!

కిటికీ అద్దం క్రిందికి దించి, దానికి చేతినీ, తలనీ ఆన్చి బయటకి చూడసాగింది పల్లవి.

రెండు నిమిషాల్లో తిరిగి వచ్చాడు చేతిలో పాకెట్ తో.

".. ఏవో కాస్మటిక్స్... మా ఆవిడ పంపమని వ్రాసింది.." ఆమె ఆశ్చర్యాన్ని గమనించినట్లూ చెప్పాడతను.

"ఓహో!" పల్లవి అనాసక్తిగా మొహం తిప్పుకుంది.

"పల్లెటూరు కదా! అక్కడ ఆవిడకి కావలసినవి దొరకవు.." అతను యింట్రస్ట్ గా చెప్పసాగాడు.

"డెలివరీకి వెళ్ళారు కదా!" అని అడిగింది పల్లవి.

"ఊ." అతను ఒకసారి తలత్రిప్పి, నవ్వి మళ్ళీ చెప్పాడు. ".. యింకో నెలలో తండ్రిని కాబోతున్నాను."

తమాషాగా చెప్పాడతను.

పల్లవి కళ్ళార్పడం కూడా మర్చిపోయి చూసింది. అతను అలా చెప్తుంటే... చాలా అపురూపంగా అనిపించింది.

కిటికీలోనుంచి ఒక్కసారిగా వీచిన చల్లగాలికి అరికాళ్లోనుంచీ వణుకొచ్చింది.

అతనికి దగ్గరగా జరిగి, చేయి పట్టుకుని... ఆ భుజం మీద తలవాల్చి, కళ్ళు మూసుకుని... అతను ఎక్కడికి తీసుకు వెళ్తే అక్కడికి అలా వెళ్ళిపోతూ...

తన ఆలోచనలకి సిగ్గుపడింది పల్లవి.

"నేను సికింద్రాబాద్ లో దిగిపోతానండీ. అక్కడినుంచి బస్ లో వెళ్తాను." అంది.

"ఎందుకు!" అతను ఆశ్చర్యంగా అడిగాడు.

"ఈ వర్షంలో బస్ లో ఏం వెళ్తారు! ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను!" ఖచ్చితంగా చెప్పాడు.

పల్లవి హాయిగా నిట్టూర్చింది. మొహమాటానికి అంది గానీ నిజంగా అలా వెళ్ళాలని ఆమెకీ లేదు.

వర్షం కొద్దిగా తగ్గినా చలి విపరీతంగా వుంది. అస్సలు చలి భరించలేదు పల్లవి. తడిసిన చీర యిపుడిపుడే ఆరుతూంటే... గాలి వస్తూన్న కొద్దీ వణుకు ఎక్కువవుతోంది.

హటాత్తుగా అడిగాడతను రోడ్డువైపే చూస్తూ.

"ఎలా వుంది మీకీ జాబ్!"

"... బానే వుంది..." ఏమనాలి యితన్ని! సర్ అనాలా అక్కర్లేదా!.. అన్న ఆలోచనతో ఒక్కక్షణం తటపటాయించి "... సర్.." అంటూ వాక్యం పూర్తి చేసింది.

ఆమె తటపటాయింపు గమనించాడో, లేదో! అతను తల కొద్దిగా ప్రక్కకి తిప్పి చెప్పాడు నవ్వుతూ... "అభిరామ్ అనండి మీరు."

మళ్ళీ అదే స్టైల్. అతను ఒక వాక్యం మాట్లాడినా, పదం మాట్లాడినా, చివరికి ఒక్క అక్షరం మాట్లాడినా సరే... "ఇది మీకు మాత్రమే యిస్తున్న అవకాశం సుమా! మీరు దీనికి అర్హులు." అన్న పొగడ్త అందులో లీలగా ధ్వనిస్తున్నట్లు వుంటుంది.

పల్లవి తలెత్తి చూసింది. ఏమాత్రం భయం లేనివాడిలా తనివితీరా చూస్తున్నాడు అతను తనని. సిగ్గుగా తల వంచుకుని తనని తాను చూసుకుంది.

వంగ పువ్వు రంగు షిఫాన్ చీర కట్టుకుంది యివాళ. ఈ చీర తనకి చాలా బాగుంటుంది. ముఖ్యంగా ఈ బ్లౌజ్. ఎంత బాగా కుదిరిందో!

తల కొంచెం వంచి చూస్తే...

అద్దినట్లుగా ఉన్న డార్క్ కలర్ బ్లౌజ్ పైన పచ్చగా మెరుస్తున్న మెడ... కంఠం వరకే వున్న పెరల్స్ సెట్... తడిసి పాయలుగా విడిపోయిన ముంగురులపైనుంచి జారి.. స్ఫటికం లాంటి చెవినీ.. ఆ చెవికి వున్న ముత్యాల లోలకుల్నీ స్పృశించి, మెడపై వాలి మెరిసిపోతున్న వర్షపు చినుకు.. ఓ కళా ఖండంలా వుంది ఆ కంఠం.

"ఆ కంఠాన్నే కనుక ఎవరైనా పెయింట్ చేసి యిస్తే ఎన్ని లక్షలయినా పెట్టి కొనుక్కోవచ్చు."

అదే.. అదే భావం కనబడిందనిపించింది పల్లవికి... అభిరామ్ కళ్ళల్లో.

కుడివైపు.. అప్పుడప్పుడే కొద్దిగా ఆరి ఎగురుతూన్న పైట.., అటో.. యిటో జారబోతున్నట్లు కనిపిస్తూ.. అంతలోనే ఆగిపోతూ ... చాలా దారుణంగా ఆడుకుంటోంది అతనితో.

ఎలాంటివారి దృష్టినైనా ఫ్లాషింగ్ లైట్ లా ఆకర్షించేలా వుంది ఆ అల్లరి.

కారు మాత్రం వేగంగా సాగిపోతూనే వుంది. అతని పట్ల ఆరాధనతో హృదయమూ.. చలితో శరీరమూ వణుకుతున్నాయి పల్లవికి.

"ఈ క్షణం.. యిదే క్షణం అతను చేయి చాపి దగ్గరికి తీసుకుంటే ... రెసిస్ట్ చేసే శక్తి తనలో వుందా!"

పల్లవి వణకడం గమనించి అడిగాడతను "చలేస్తోందా!"

అతను చాలా దూరంలోనే వున్నాడు. కానీ ఆ అడిగే తీరు... చెవిలో గుస గుస లాడినట్లే అనిపించింది ఆమెకి.

పల్లవి నిటారుగా అయింది. అతని చేతిపై చేయి వేసేందుకు అణువణువూ ఆరాటపడింది. తనంతట తాను ఆపని చేయలేదు. అతనెందుకు సందేహిస్తున్నాడు!

"ఎటు వెళ్ళాలి!" అభిరామ్ ప్రశ్నకి పల్లవి తేరుకుని చూసింది.

"అపుడే వచ్చేశామా!" అనిపించింది.

"లెఫ్ట్ తిరగాలి.. యిపుడు రైట్..." డైరక్షన్స్ చెప్పసాగింది.

ఇల్లు వచ్చేసింది. ఇంటివాళ్ళ తలుపులు వేసేసి వున్నాయి.

"మేడమీదా!"

అవునన్నట్లు తలవూపుతూ దిగింది పల్లవి.

మళ్ళీ కొద్దిగా వర్షం పడుతోంది.

కారు డోర్ వేసేస్తుంటే అడిగాడతను. "లోపలికి రమ్మనరా!"

ఉలికిపాటుగా చూసింది పల్లవి. ఆమెకి అర్థమయింది. అతను.. అతను.. తనని కోరుకుంటున్నాడు.

"...రండి సర్"

ఆమాట తను చెప్పిందా! మనసులో అనుకుందా!

చెప్పేవుంటుంది. లేకపోతే అతను ఎందుకు కారు దిగుతాడు! లేకపోతే తల వూపిందేమో!

పల్లవికి అర్థం కాక ముందే వాళ్ళిద్దరూ మెట్ల మీద వున్నారు.

అతని మోచేయి నడుము దగ్గరగా తగిలింది. వెచ్చటి ఆవిరిని పంప్ చేసి అంతలోనే స్క్వీజ్ చేసినట్లయింది.

అతని హృదయం మీద తలవాల్చి.. అతని శ్వాసలో చలి కాచుకోగలిగితే.. యింకా ఎందుకు అతను తటపటాయిస్తున్నాడు!

తన లోపం లేదు. తను చాలా దగ్గరగానే నడుస్తోంది. అతను కొంచెం చొరవ చేసి తన నడుము చుట్టూ చేయి వేస్తే, అతన్ని అల్లుకు పోతుంది. సందేహం లేదు.

ఎపుడు అందుకుంటాడు తనని... ఈ మెట్టు మీద... ఈ మెట్టు మీద.. ఈ.. మె.. ట్టు.. మీ.. ద..

ఆఖరి మెట్టు మీద నిలబడి, తాళం తీయబోతే.. చేతులు చలికి వణుకుతున్నాయి.

ప్రక్కనున్న కొబ్బరిచెట్టు గాలికి వూగడం తో నీటి జల్లు విసురుగా వచ్చి పల్లవి వంటిని తడిపింది. అంత విసురుగానూ తాను అతని మీదకి ఎందుకు వాలలేదో పల్లవికి అర్థం కాలేదు. ఇద్దరూ లోపలికి అడుగు పెట్టారు.

"కూర్చోండి." వణికిపోతూ చెప్పి బెడ్ రూం లోకి నడిచింది.

ముందు ఈ బట్టలు మార్చేసుకోవాలి. ఎదురుగా అద్దంలో ఆమె ప్రతిబింబం. . . శిల్పంలా కనిపిస్తోంది. చెవికి వున్న లోలకులు, గుండె మీది ముత్యాలు. . ఈదురుగాల్లో పెట్టినట్లూ వూగుతుంటే అర్ధమయింది పల్లవికి, తానెంతగా వణుకుతూందో.

బీరువాలోనుంచి సిల్క్ నైటీ తీసుకుని వేసుకుంది. బీరువా అంతా చెల్లాచెదురు చేసి. . బట్టలన్నీ చిందరవందర చేసి, అడుగున ఎక్కడో పడి వున్న షాల్ సంపాదించి కప్పుకుంది.

చేతులు రెండూ దగ్గరగా కట్టుకుని, వణికిపోతూ హాల్లోకి వచ్చింది.

అతను అలాగే కూర్చుని వున్నాడు తడిసిన తలతో. తన మతిమరుపుకు తిట్టుకుని, పరుగెత్తుకుంటూ వెళ్ళి అతనికి టవల్ తెచ్చి యిచ్చింది.

ఆ తర్వాత వంటగదిలోకి నడిచింది. చేతులు రుద్దుకుంటూ టీకి నీళ్ళు పడేసింది. టీ అద్భుతంగా చేస్తుంది పల్లవి.

అల్లం వేసిన టీ. రెండు కప్పులు ట్రేలో పెట్టుకుని వస్తూ గమనించింది తన వణుకు కొద్దిగా తగ్గిందని. అయిదునిమిషాలు స్టవ్ దగ్గర నిలబడింది కదా మరి!

అతను టి. వి. పెట్టుకుని టెన్నిస్ చూస్తున్నాడు. అతనికో కప్ అందించి, తానొకటి తీసుకుంది.

మౌనంగా టీ త్రాగసాగింది. ఒక్కొక్క సిప్ తీసుకుంటుంటే శరీరంలో కొద్దికొద్దిగా వేడి ప్రవేశిస్తోంది. అబ్బ! ఎంత హాయిగా వుంది! షాల్ క్రింద వెచ్చగా వుంది.

ఇక వంటా గింటా చేసే పని లేదు. బ్రెడ్, యాపిల్స్ వున్నాయి. అవి తినేసి వెచ్చగా రగ్గు కప్పుకుని పడుకోవడమే. చక్కటి ఇస్త్రీ దుప్పటి వేసుంచిన పక్కా, బీరువాలో రగ్గూ గుర్తొచ్చి పల్లవికి ఆనందం వేసింది.

కప్ క్రింద పెడుతూ చూసింది. అతను యింకా టీ త్రాగుతూనే వున్నాడు.

"అంతసేపు త్రాగుతాడేమిటి! చల్లారిపోదూ!" ఆశ్చర్యంగా అనుకుంది పల్లవి.

అతను కప్ క్రింద పెట్టి సోఫాలో వెనక్కి వాలాడు. వళ్ళు విరుచుకుంటూ అన్నాడు.

"టెన్నిస్. . నాకు చాలా యిష్టమయిన ఆట."

పల్లవి నవ్వింది. ఆమెకీ, ఆటలకీ చాలా దూరం.

"మీకు ఇంట్రస్ట్ లేదా!" అడిగాడతను.

మళ్ళీ యింకొకసారి యిబ్బందిగా నవ్వింది పల్లవి.

అతను గమనించాడో. లేదో టి. వి. చూడడంలో లీనమయిపోయాడు.

అరగంట గడిచింది. పల్లవికి విసుగొచ్చింది.

ఎప్పుడెప్పుడు వెళ్ళిపోతాడా! ఎప్పుడెప్పుడు వెళ్ళి పడుకుందామా! అనిపిస్తోంది.

ఇంకో పదినిమిషాలయ్యాయి.

"ఏమిటితని ఉద్దేశ్యం! కదలడేంటి!" అనుకునేలోపూ అతను లేచాడు.

"నే వెళ్తా మరి" అంటూ.

అతను బయటికి నడిచాడు. మళ్ళీ పెద్ద వర్షం వస్తోంది. బయటికి రాబోయిన పల్లవి అది గమనించి ఆగిపోయింది.

అతను చేయి అడ్డం పెడుతూ అన్నాడు, "మీరుండండి."

పరుగెత్తుతూ క్రిందికి వెళ్ళాడు. తడిసి ముద్దయిపోయి కార్లో కూర్చుంటున్న అతన్ని పైనుంచే గమనించింది పల్లవి.

కారు వెనక్కి తిప్పుకుని వెళ్ళిపోతుంటే ఒక్క క్షణం జాలేసింది. మరుక్షణం తలుపు వేసేసుకుని లోపలికి నడిచింది.

పదినిమిషాల తర్వాత మంచం వైపు నడుస్తూ అనుకుంది పల్లవి. "పోన్లే తొందరగానే వెళ్ళారు. ఇంకా ఎంతసేపు వుంటారో అని భయం వేసింది."

తన ఆలోచనకి తనకే ఆశ్చర్యం వేసింది.

"కార్లో వున్నపుడూ.. కారు దిగాక.. అతనికోసం తపించిన తనేనా!

మెట్లెక్కుతున్నపుడు., చివరికి యింట్లోకి అడుగుపెట్టే క్షణం వరకూ కూడా.. అతను రాత్రికి వుండిపోతే బాగుండును అనుకున్న తనేనా!

అంత త్వరగా తన భావాలు ఎలా మారిపోయాయి!

ఇంట్లోకి వచ్చి, వెచ్చటి షాల్ కప్పుకుని, టీ త్రాగగానే..."

నవ్వొచ్చింది పల్లవికి.

మంచం మీదికి ఎగిరినట్లుగా ఎక్కి, మూడంకెలా ముడుచుకుపోతూ అనుకుంది.

"పాపం! ఆఖరి మెట్టు మీద అడిగినా ఒప్పుకుని వుండేదాన్నేమో!"

ఒక అల్లరి నవ్వు రగ్గు క్రింద అణగిపోతుంటే ఆనందంగా కళ్ళు మూసుకుంది.

*****